# బీఆర్ఎస్‌లో చేరిన సూరారం యువత

**కండువా కప్పి ఆహ్వానించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 19 : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువ నాయకులు భారీగా గురువారం హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నచ్చకనే బీఆర్ఎస్‌లో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో తక్కళ్లపల్లి వినయ్‌రావు, పొలాటి వినయ్‌రావు, బచ్చు ప్రశాంత్ రావు, భాషబోయిన ప్రశాంత్, మేకల కృష్ణసాయి, బచ్చు అరుణ్‌రావు, మన్విత రావుతో పాటు సుమారుగా 150 మంది చేరగా, వారికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులతో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు


లోక్యాతండాలో దూడలను పంపిణీ చేస్తున్న మహేశ్ ఆగర్వాల్

## పశుసంపదతో రైతులకు మేలు

వేలేరు, అక్టోబర్ 19 :పశుసంపదతో రైతులకు మేలు కలుగుతుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ ఆగర్వాల్ అన్నారు. వేలేరు మండలం లోక్యాతండాలో శివశంకర గోశాల ఆధ్వర్యంలో పది మంది రైతులకు రెండు చొప్పున 20 కోడె దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పశువులు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పశువుల పేడ, మూత్రాన్ని ఎరువులుగా ఉపయోగించి, రైతులు సేంద్రియ పద్ధతిలో అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల రైతులకు ఉచితంగా దూడలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మురావత్ అనురాధ, సూపరింటెండెంట్ దుర్గం రోజా, గోశాల కార్యదర్శి సుధాకర్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : సంస్కృతి, సంప్రదాయాలు, కళల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని శ్రీభారతీ సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లేటి కృష్ణామాచారి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ బతుకమ్మ భక్తి జానపద గేయ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి వంగల కల్పన, ద్వితీయ బహుమతి తొగరు స్వరూప, తృతీయ బహుమతి నాగపురి వనమాల, ప్రోత్సాహక బహుమతులు వంగ ధనలక్ష్మి, అనుములపల్లి ఉమాదేవి, రావుల కవితతోపాటు మరో 20 మంది మహిళలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం మహిళలు బతుకమ్మ సంబరాల్లో పాల్గొని ఆటపాటల ద్వారా అలరించారు. కార్యక్రమంలో నాసం కరుణ, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, మాడిశెట్టి శ్రీనివాస్, ఎడెల్లి ఎల్లారెడ్డి, సిరికొండ కవితాశ్రీధర్, రావుల్కార్ శైలజ, పిన్నింటి జ్యోతి, గుండాల అనురాధ, సిరికొండ సుజాత, సార్గు సంపత్, సమ్మెట సత్యనారాయణ, ఠాకూర్, మోతిసింగ్, శ్రీరామోజు నాగసోమేశ్వరాచారి, వంగల వేణు, గోపాల్, శివ, మేకల శంకర్, మడుపు అఖిల్, కొలగాని నవీన్, నాగపూరి శ్రీనివాస్, ధనాలకోట రత్నాకర్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న అధ్యాపకులు

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

న్యూశాయంపేట, అక్టోబర్ 19 : హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న వాణిజ్యశాస్త్రం అధ్యాపకుడు గాదె నాగేశ్వర్‌రావు ఇటీవల గుండెపోటుతో మరణించగా తోటి అధ్యాపకులు గురువారం నాగేశ్వర్‌రావు దశదినకర్మను పురస్కరించుకుని బాధిత కుటుంబానికి రూ.72,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కామర్స్ కోఆపరేటివ్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు సీకేఎం రావు, ఆచార్య శశిధర్‌రావు, డాక్టర్ కనకయ్య, సురేశ్, ఫణికుమార్, రాజేంద్రప్రసాద్, నాగరాజు, సంజీవ్ పాల్గొన్నారు.

## కాజీపేటలో రైల్వే ఈసీసీఎస్ ఎన్నికలు ప్రశాంతం

**85 శాతం పోలింగ్ నమోదు**

కాజీపేట, అక్టోబర్ 19 : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ(ఈసీసీఎస్) డెలిగేట్స్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ 85 శాతం జరిగిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. రైల్వే సబ్ డివిజన్ పరిధిలో 11వ నియోజక వర్గం పరిధిలో 2629 మంది కార్మిక ఓటర్లు ఉండగా 8 పోలింగ్ బూత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసీసీఎస్ ఓటర్లు ఉదయం 8 నుంచి రాత్రి వరకూ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు విచ్చేసిన ఓటర్లను లోపలికి అనుమతించారు. సమయం తర్వాత ఎవ్వరూ లోపలికి వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా, ఎలక్ట్రికల్ (టీఆర్‌డీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాలుగో పోలింగ్ బూత్ వద్ద ముగ్గురు ఓటర్లు పది నిముషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు. అయితే, ఆ కార్మికులు డ్యూటీలో భాగంగా వెళ్లడంతో ఆలస్యమైందని ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ గొడవ జరిగింది. ఈ విషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, రైల్వే అధికారులు, ఏజెంట్లు చర్చించుకుని ఆ ముగ్గురు ఓటు వేసేందుకు అనుమతించారు. అయితే, ఓటింగ్‌లో ఇరువర్గాలకు సమానంగా ఓట్లు వచ్చినప్పుడు మాత్రమే ఆ ఓట్లును వాడుకునేలా వాటిని ప్రత్యేక కవర్‌లో సీల్ చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు ఈ నెల 29న సాయంత్రం వెల్లడించనున్నట్లు రైల్వే కార్మిక వర్గాలు తెలిపాయి.

## మద్యం తాగి వాహనాలు నడపొద్దు

**ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ బోజరాజు

సుబేదారి, అక్టోబర్ 19 : మద్యం తాగి వాహనాలు నడుపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు అన్నారు. గురువారం బీమారం ఎర్రగట్టు గుట్ట కిట్స్ కళాశాలలో హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లను ఇవ్వొద్దని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, కళాశాల డీన్ శంకర్, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో చోరీ..

కేసముద్రం, అక్టోబర్ 19 : మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు సీఐ రమేశ్ గు రువారం తెలిపారు. మండల కేంద్రంలోని కిష్టాపురానికి చెందిన హనుమయ్య కుటుంబ సభ్యు లు మూడు రోజుల కితం వరంగల్ వెళ్లారు. కాగా, గురువారం ఉదయం పని మనిషి వచ్చి ఇంటి ముందు శుభ్రం చేస్తున్న క్రమంలో ఇంటి తలుపు లు పగులగొట్టి ఉండడాన్ని చూసి హనుమయ్యకు సమాచారం ఇచ్చింది. ఆయన ఇంటికి వచ్చి చూ డగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే హనుమయ్య ఇంటికి ఎస్సై తిరుపతి, సిబ్బందితో కలిసి చేరుకున్నట్లు సీఐ తెలిపారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించినట్లు, బాధితుడి ఫిర్యాదు మేరకు.. 50 వేల నగదు, 35 తులాల వెంటి దొండలు అపహరించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## నల్లబెల్లం, పటిక పట్టివేత

గిర్మాజీపేట, అక్టోబర్ 19: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 40 కేజీల నల్లబెల్లం, 5 కేజీల పట్టికను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన అజ్మీరా ఉమ నాటుసారా తయారీకి కావాల్సిన ముడి పదార్థాలైన నల్లబెల్లం, పటికను తీసుకెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ముడి సరుకును స్వాధీనం చేసుకొని, నిందితురాలిని విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పీ రమేశ్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో భారీగా సొత్తు స్వాధీనం

- ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బు, నగలు పట్టివేత
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో రూ. 54,02,950 విలువైన బంగారు ఆభరణాలు..
- దేవన్నపేట టోల్‌గేట్ వద్ద రూ. 25లక్షలు సీజ్
- ఉర్సు గుట్ట వద్ద రూ. 2.32లక్షల విలువైన మద్యం స్వాధీనం


పట్టుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న సీఐ నరేశ్

## రైల్వేస్టేషన్‌లో బంగారు ఆభరణాల పట్టివేత

ఖిలావరంగల్, అక్టోబర్ 19 : వరంగల్ రైల్వేస్టేషన్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు భారీగా బంగారు అభరణాలు పట్టుకొని గురువారం కమర్షియల్ అధికారులకు అప్పగించారు. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన బీ సీతారామన్ బంగారు ఆభరణాలతో సేలం నుంచి బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ద్వారా వరంగల్‌కు చేరుకున్నాడు. వరంగల్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేయగా, సీతారామన్ దగ్గరున్న బ్యాగ్‌లో రూ.54,02,950 విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. వాటికి సంబంధించిన రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని కమర్షియల్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి

## ఉర్సుగుట్ట వద్ద మద్యం స్వాధీనం

ఖిలావరంగల్, అక్టోబర్ 19 : ఉర్సుగుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను మిల్స్‌కాలనీ పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి కథనం ప్రకారం.. చెక్‌పోస్టు వద్ద పోలీసులు కారులో తనిఖీ చేయగా, రూ. 2,32,000 విలువైన 84 మద్యం సీసాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన మొలగుండ్ల పార్థసారధిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సీఐ సురేశ్, ఎస్సైలు డీ రాజు, వెంకన్న, నవనీత, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో రూ. 25లక్షలు పట్టివేత

ధర్మసాగర్, అక్టోబర్ 19 : మండలంలోని ఎన్‌హెచ్ దేవన్నపేట టోల్‌గేట్ వద్ద గురువారం రాత్రి రూ. 25లక్షల నగదును పట్టుకున్నామని కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో మెగా కంపెనీకి చెందిన ఉద్యోగులు చుక్క నాగేశ్వర్‌రావు, గుండ శేఖర్ ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదును సంబంధిత శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ధర్మసాగర్ సీఐ శ్రీధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు